
# ఓంకారేశ్వరా... గుడి దిగిరా!

నేటినిజం... దసరా ప్రత్యేక సంచిక, 2001



'కోవెల లేని ఊరును, మనసులేని మనిషిని ఈ జగతి హర్షించదట!'

అందుకేనేమో... జన్మనెత్తిన మనిషి మానవత్వంతో మనసే కోవెలగా పునీతమవ్వాలని అనుకుంటాడు.

ఉద్యోగం నుండి రిటైరైన రామనాథంగారి మనసు ఆ దిశగా ఆలోచిస్తోంది.

చేసింది చిన్నఉద్యోగమైనా, తనకు పెద్దగా చదువుసంధ్యలు లేకపోయినా స్వార్థం, సంకుచితత్వాలకు అతీతంగా ఉన్నతమైన వ్యక్తిత్వంతో వ్యవహరించే రామనాథంగారంటే... ఆ ఆఫీసులోనే కాదు- ఆ ఊరి వారందరికీ ఎంతో అభిమానం!

ఎవరికి కష్టం కలిగినా- ముందుండి సర్దిచెప్పే రామనాథంగారంటే అటెండరు నుండి ఆఫీసరు వరకు అందరూ తమ ఆత్మబంధువుగా ఆదరించేవారు. కొడుకు చదువు అయినా, కూతురు పెళ్ళి అయినా, మనవడి బారసాల అయినా ప్రతివారూ ఆయనను సంప్రదించకుండా అడుగు ముందుకు వేసేవారు కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే... అది వాళ్ళ సెంటిమెంట్!

అటువంటి విశిష్టమైన వ్యక్తిత్వం గల ఆయన ఉద్యోగపరంగా 'రిటైర్మెంట్' పేరుతో తమకు దూరమైపోతుంటే అందరూ చాలా బాధపడ్డారు.

రామనాథంగారు కర్మసిద్ధాంతాన్ని ఎక్కువగా నమ్ముతుంటారు. పుట్టిన మనిషి మట్టిలో కలిసేవరకూ ఇతరులకు ఉపయోగపడాలనే తత్వం ఆయనది! 'వార్ధక్యపు ప్రథమాంకంలో ప్రవేశించిన తను సిసలైన మనిషిగా బ్రతకాలి, మానవత్వాన్ని ఇతరులలో పెంపొందించాలి' అనే దృక్పథంతో ఉన్న ఆయన మనసులో 'హైందవ సంస్కృతి' అనే బీజం పడింది.

హైందవ సంస్కృతికి మూలం... దేవుడు, దేవాలయం! విగ్రహారాధనలకు దేవాలయ సందర్శన!

మనిషై పుట్టినవాడు కారాదు మట్టిబొమ్మ. మనిషి మనసు మట్టితనం ఆపాదించుకోకుండా ఉండాలంటే దేవాలయ సందర్శనానికి ప్రాముఖ్యత ఇవ్వాల్సివుంటుంది. దేవుణ్ణి నమ్మిన నాడు- మనిషి హృదయంలోని 'అహం' నిర్జీవమై జ్ఞాన కిరణాల వెలుగులో జన్మ పునీతమవుతుంది.

తరువాత తన అభిరుచికి అనుగుణంగా ప్రశాంతమైన ప్రకృతి వాతావరణం, స్వచ్ఛమైన గాలి, నీరు, వెలుతురులతో మనిషి మనసును సేదతీర్చే ఆ పల్లెప్రాంతానికి చేరుకున్నాడు. ప్రపంచం ఎంతో ముందడుగు వేస్తూంటే... అభివృద్ధి కుంటుపడి ఆధునిక సంస్కృతికి దూరంగా మరో ప్రపంచంగా ఉన్న ఆ ప్రాంతంలో తన తదుపరి అంకానికి తెరతీశాడు.

అక్కడి మనుషులు మంచివారే గాని, ఎవరి దోవ వారిది! పల్లెలలోని రాజకీయాలు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!' అన్న సామెతని తలపింపచేస్తున్నాయి.

రామనాథంగారి మనసు పొరల్లో నిక్షిప్తమైన భగవంతుడు అక్కడి తన పాతస్నేహితుల సహకారంతో వాస్తవరూపాన్ని పొంది, సముద్రతీరంలోని ప్రశాంతమైన ఆ ఊరి నడిబొడ్డున ఓ చిన్నపాకలో దేవుణ్ణి వుంచి, 'ఓంకారేశ్వరుడు' అని నామకరణం చేశాడు. నిత్యపారాయణాలతో, భజన, పురాణ కాలక్షేపాలు అక్కడ రామనాథంగారి ఆధ్వర్యంలో జరుగుతూంటే... ఆ ప్రాంతానికి పవిత్రత చేకూరేది. ఆయన మనసు ఎంతగానో ప్రశాంతత చెందేది.

నెమ్మదిగా ఆయన ప్రయత్నానికి మెచ్చి ఒక్కొక్కరే ఆ చిన్నగుడిసెలోని పటాల దర్శనానికి రావడం మొదలుపెట్టారు. ఉదయం అభిషేకాలు, సాయంత్రం పారాయణాలు, దైనందిన కార్యక్రమాలు రామనాథంగారి చేతుల మీదుగా జరుగుతూంటే... ఆయన్ని ఆ ప్రాంత ప్రజలందరూ 'నడుస్తున్న దేవుడు'లా ఆరాధించేవారు.

వంటిల్లు దాటి ఎన్నడూ బయటకురాని ఇంటి ఇల్లాలు- సాయంత్రానికి అక్కడికి చేరుతూంటే, కాటికి కాళ్లు చాచిన వృద్ధులు సైతం రోజూ అక్కడికి వచ్చేవారు. పిల్లలు మొదలు పెద్దలదాకా అక్కడ సత్సంగాలు నిర్వహిస్తూంటే... రిక్షా సూరన్న దగ్గర నుండి బ్రాందీషాపు పరబ్రహ్మం దాకా అందరూ ఆ సమయంలో తమ పనులు మానుకొని అక్కడికి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఓ తల్లి తీర్థం పంచితే, ఓ చెల్లి ప్రసాదం పంచేది. వ్యవసాయానికి వెళ్లినవారు

త్వరగా పనులు చక్కబెట్టుకొని వస్తే, వ్యాపారస్తులు తమ తమ దుకాణాలు తాత్కాలికంగా మూసి ఆ సమయానికి అక్కడికి చేరేవారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన అక్కడి ప్రజలు- కులాలకు అతీతంగా స్వామిసన్నిధిలో ఆత్మీయతను పంచుకుంటుంటే... 'మేమూ తీసిపోలే'దంటూ ఇతర మతస్థులు కూడా తమ హర్షాన్ని వ్యక్తం చేస్తుండేవారు. అక్కడ 'సెక్యులరిజం' 'భిన్నత్వంలో ఏకత్వం' అనే నినాదాలు సోదాహరణగా కనిపించేవి.

"రామనాథంగారూ! ఏ ఊరి నుండి వచ్చారో, ఎలా వచ్చారో తెలియదు గాని- దేవుడు, దేవాలయం, భక్తి అనే విషయాల మీద పెద్దగా అవగాహన లేని మాలో ఓ విధమైన మార్పు తీసుకొచ్చి మానవత్వాన్ని మేలుకొలిపారు. ఈ ఊరి ప్రజలందరూ మీకు ఎంతగానో ఋణపడి వున్నారు" సర్పంచ్ నాగభూషణం అంటుంటే-

"అంతా దైవేచ్ఛ... నేను నిమిత్తమాత్రుణ్ణి!" అని వినమ్రతగా పలికారు రామనాథంగారు.

"బాబుగారూ! మీరు ఈ మానవజన్మకు అర్థాన్ని కలిగిస్తున్నారు. కలకాలం మీరు చల్లగా ఉండాలి!" నడివయస్కురాలు కోటేశ్వరమ్మ అంటుంటే... నవ్వి ఊరుకొనేవారు.

"రామనాథంగారూ! గతంలో అల్పాచమనాలు చేసిన ఈ స్థలంలో మాచేత ఆచమనాలు చేయించి ఈ ప్రాంతాన్ని పవిత్రపరుస్తున్నారు" ఊరిపెద్ద రంగనాయకులు కితాబు ఇస్తే-

"రోజూ త్రాగుడు, జూదాలతో జులాయిగా తిరిగే మా అబ్బాయి అన్నీ మానేసి, మంచి మనిషిగా మారాడు. ఆ చలవ అంతా మీదే!" అంటూ శేషాచారి ప్రశంసల వర్షం కురిపించేవాడు.

"దేవుడిలా ఈ ఊరు వచ్చి దేవుణ్ణి నెలకొల్పిన మీరు ధన్యులు! అలాగే మీ అమృతహస్తాలతో ఈ పూరిపాక పవిత్రమైన కోవెలగా రూపాంతరం చెందాలని నా కోరిక. ఈ దేవాలయ నిర్మాణానికి ప్రస్తుత మందిరానికి ఆనుకొని ఉన్న నా సొంత స్థలం విరాళంగా ఇస్తున్నాను. ఈ ముసలిదాని కోర్కెను తీరుస్తారు కదూ?!" ఆపేక్షగా అడుగుతున్న అనసూయమ్మగారి మాటలు ఆయనలో స్ఫూర్తిని కలిగించాయి.

"అవును. మీ ఆధ్వర్యంలో ఈ పవిత్రకార్యం నెరవేరాలి. ఈ దేవాలయ నిర్మాణానికి నా వంతుగా ఏభైవేల రూపాయలు విరాళం ప్రకటిస్తున్నాను" ప్రెసిడెంట్ నాగభూషణం అనేసరికి-

పోటీగా "నా విరాళం వంద సిమెంట్ బస్తాలు!" సిమెంట్ డీలర్ చలమయ్య ప్రకటించాడు.

"అయ్యగారూ! నా దగ్గర ఈ పాతిక రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఇంతకుమించి ఇచ్చుకోలేని పేదవాణ్ణి!" రిక్షా సూరన్న పంచె మడతలోని సొమ్ములు తీసి ఇచ్చేసరికి-

"బాబూగారూ! మీరు ప్రారంభిస్తున్న ఈ మంచిపనికి మా విరాళం ఇదిగో!" అంటూ ఇతర మతస్థులు కూడా ధారాళంగా విరాళాలు ప్రకటిస్తూంటే... రామనాథంగారు పులకించి పోయారు.

చివరికి ఊరంతా ఒక్కటై గుడి నిర్మాణ బాధ్యత ఆయన మీద పెట్టింది.

"అంతా దైవసంకల్పం!" అనుకొని, పవిత్ర పర్వదినాన వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య 'ఓంకార క్షేత్రా'నికి శంకుస్థాపన చేశారు.

క్షేత్ర నిర్మాణం తన జీవితాశయంగా స్వీకరించి, 'స్వామి ఆలయప్రవేశం చేస్తేనేగాని చెప్పులు ధరించేది లేదు, గడ్డం తీసేది లేద'ని ప్రకటించి పట్టుదలతో నడుం బిగించారు.

• • •

మొత్తానికి భక్తుల భూరివిరాళాలతో అలుపెరుగక నిరంతరం శ్రమించిన వయోవృద్ధుడు రామనాథంగారి కలల రూపం 'ఓంకార క్షేత్రం' సర్వాంగసుందరంగా రూపుదిద్దుకొంది.

ఋత్విక్కుల సామూహిక ప్రవచనాలతో, కలశ స్నాపన మొదలు అధివాసాలతో తులతూగిన ఓంకారేశ్వరుడు రామనాథంగారి చేతుల మీదుగా తన స్థానంలో ఆశీనుడయ్యాడు.

మొత్తానికి ప్రతిష్టా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ముగిశాయి.

"నేను డెబ్భయ్యో పడిలో పడ్డాను. ఇదివరకటిలా ఉత్సాహంగా పనిచేసేందుకు శరీరం, ఆరోగ్యం సహకరించడం లేదు. మీరందరూ కోరినట్లుగా మీమీ సహకారాలతో ఆలయం నిర్మించుకోవడం జరిగింది. క్షేత్ర నిర్వహణకు, నిత్య ధూపదీప నైవేద్యాల కొరకు భక్తుల నుండి చందాల రూపంలో వసూలు చేసిన సొమ్ములు పదిలక్షల వరకు ఉన్నాయి. వాటిని పొదుపుగా వినియోగించి స్వామిసేవలో తరించండి. నా ఆశీస్సులు మీకు ఎప్పుడూ ఉంటాయి. ఈ క్షేత్ర నిర్వహణకు కొంతమంది కార్యకర్తలతో ఒక ఆలయ కమిటీగా ఏర్పాటుచేస్తే బాగుండునని నా అభిప్రాయం!" ఆ సమయంలో అందరూ రామనాథంగారి మాటలతో ఏకీభవించారు.

• • •

దేవుడు సృష్టించిన మనిషి కన్నా, మనిషి సృష్టించిన డబ్బుకి విలువ ఎక్కువ.

భగవంతునిచే సృష్టింపబడ్డ మానవుడు- కాలగమనంలో ఆ భగవంతుణ్ణే శాసించే స్థాయి కెదుగుతాడట! అది కాల మహిమ!

అక్కడి డబ్బు, పదవులు చూసేసరికి- అంతవరకు వారిలో నిద్రాణమైవున్న దురాశ, కోరిక, అహం, దర్పాలు ఒక్కసారి రెక్కలు విప్పి జూలు విదిలించాయి.

కొందరికి అక్కడున్న లక్షల రూపాయల మీద అజమాయిషీ కావాలి. కొందరికి పదవి కావాలి, మరికొంతమందికి ప్రాబల్యం కావాలి. మొత్తానికి అమృతప్రాయమైన ఆ సుక్షేత్రంలో విషబీజాలు నాటబడ్డాయి.

"రామనాథంగారూ! దేవాలయ నిర్మాణానికి మొదటి విరాళం ప్రకటించింది నేనే! నేను రాబోయే ఎన్నికల్లో సర్పంచ్‌గా తిరిగి పోటీ చేయదలచుకున్నాను. అప్పుడు ఓట్లు పడాలంటే ఇక్కడి ప్రజలను మచ్చిక చేసుకోవడం తప్పనిసరి! కమిటీ ఛైర్మన్ పదవికి మీరు నా పేరు సూచిస్తే నా పని సులభతరం అవుతుంది. మీ ఉపకారం నేను మరోలా తీర్చుకుంటాను లెండి!" ప్రెసిడెంట్ నాగభూషణం రహస్యంగా అంటుంటే... రామనాథం వింతగా చూశాడు.

"మా ప్రాపకం ఇక్కడ ముఖ్యం! అందుచేత మా కులస్థులకు దేవాలయ కమిటీలో ఎక్కువ పదవులు వచ్చేటట్లు చూడవలసిన బాధ్యత మీది!" ల్యాండ్‌లార్డ్ హనుమయ్య నిలదీస్తోంటే... కృంగిపోయాడు.

"రామనాథంగారూ! నన్ను ఛైర్మన్‌గిరికి సిఫార్సు చేయండి. ఆ పదిలక్షలు నా చేతిలోకి వస్తే మనిద్దరం మూడోకంటికి తెలియకుండా దోచుకోవచ్చు. మీ శ్రమకు తగిన ఫలితాన్ని, మీ వాటాను నేను ఉంచుకోను లెండి!" చలమయ్య మాటలు విని... అవాక్కయిపోయాడు.

"తాతా! మొదటినుండి ఈ క్షేత్ర నిర్మాణానికి మా యూత్ అంతా మీ వెన్నంటి ఉండి పనిచేశాం. కాబట్టి ఎక్కువ పదవులు మా యూత్‌సంఘ సభ్యులకు రావాల్సిన అవసరం వుంది. అదీ ఛైర్మన్ పదవి నాకు రావాలి. లేకపోతే నీ అంతు చూస్తా!" బెదిరించి దౌర్జన్యం చేస్తున్న

బ్రాందిషాపు పరబ్రహ్మం కుటిలత్వానికి... ఖిన్నుడైపోయాడు. మొత్తానికి ఎంతో భక్తి ప్రపత్తులతో, అంకిత భావంతో పనిచేసిన వ్యక్తులు అక్కడి సొమ్ములకి, పదవులకి ఆకర్షితులై వాటికోసం వివిధ గ్రూపులుగా విడిపోయారు.

"నాది, నేను' అన్న భావన లేకుండా స్వార్ధరహిత పరిత్యాగం సాటిమానవుని కోసం చేయగలిగినప్పుడు ఈ జీవితానికో పరమార్థం కలుగుతుంది. కానీ, మానవ బలహీనతలకు ఒకదానితో మరొకటి సమన్వయం కుదరదు. ఎన్నో వేల సంవత్సరాల చరిత్రకు ఈ భూమండలంపై ఆధారం ఉన్నా- ఏ మనిషీ ఇక్కడ మిగలలేదు, మిగలబోడన్న పచ్చినిజం తెలిసినా యుగయుగాలుగా స్వార్ధం, సంకుచితత్వాలు మనిషిని పెనవేసుకొని ఈనాటికీ నైతికంగా పతనం చేయడం మాత్రం మానలేదు. ఎందుకీ జీవితం? అసలేమిటీ ప్రపంచం?!"

రోజూ ఎంతో అన్యోన్యంగా, సందడిగా ఉండే ఆ క్షేత్ర ప్రాంగణమంతా ఒక్కసారి నిర్మానుష్యమైపోయింది. ఒకరి మీద ఒకరు దుమ్మెత్తిపోసుకోవడాలు, వ్యక్తిగత విమర్శలు, నయానా- భయానా ఇతరుల్ని కూడగట్టుకోవడానికి ప్రయత్నించడాలు మామూలైపోయాయి.

రామనాథంగారి మీద ఎవరికి తోచిన రీతిలో వారు ఒత్తిడి తీసుకువస్తూండడంతో... మానసికంగా చాలా కృంగిపోయాడాయన.

"స్వామీ! ఏమిటీ అగ్నిపరీక్ష? నాలో నిన్ను దాచుకున్నాను, నిన్ను క్షేత్రాధిపతిని చేయడం కోసం శక్తివంచన లేకుండా కృషిచేయడం మాత్రమే నా వల్ల జరిగే పని. కానీ, ఏమిటీ విపరీతం? మనిషికీ, మనిషికీ మధ్య ఏమిటీ అగాధం? డబ్బే ముఖ్యమా? డబ్బు తిని, డబ్బు తాగి... మనిషి డబ్బుతనాన్ని అలవరచుకోవడం న్యాయమా? మనుషుల మధ్య ఈ రాగద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలు, బలనిరూపణలు ఏమిటి? నాకు సాటిమనుషులుగా ఇక్కడి మనుషులపై రాగబంధం ఉంది కాని, కఠినమైన మనసులపై, వారి విధానాలపై నాకు అధిపత్యం లేదు. మనుషుల మనోభావాల్ని మార్చడానికి నేనేమీ దైవాంశ సంభూతుణ్ణి కాను, యుగపురుషుణ్ణి అంతకన్నా కాను. వారిలో జ్ఞానదీపికలు వెలిగించడానికి సంకుచితత్వాలను విడనాడి మంచిబాటలో నడవడానికి నువ్వే నడుం బిగించాలి... తక్షణం మేలుకోవాలి! రాయివై గుడిలో నిర్జీవంగా కూర్చుంటే చాలదు... స్ఫూర్తిప్రదాతవై దేవాలయ తలుపులు తెరుచుకొని బయటకు రావాలి.

ఓంకారేశ్వరా... తక్షణం గుడి దిగి రావయ్యా! నీ భక్తులు సక్రమంగా మెలిగేటట్లు నీవే సరిచేసుకోవయ్యా!"

ఆశ నీడగా వెలిగింది... నిరాశ నీడగా కదిలింది!

రాయిలా కఠినంగా తయారైన ఆయన హృదయంలో రాగోదయం చూడగల్గడం ఇక అసంభవం! మనసు పొరలలో సహజంగా అలాంటి మెత్తని ఊహ మెదిలినా- అక్కడివారి మాటలతో, చేష్టలతో ఆయనలోని సున్నితత్వం అణగారిపోయింది.

రామనాథంగారు విచిత్రమైన మానసిక సంఘర్షణతో- శిథిలమైన వ్యక్తిత్వంతో, అణగారిన ఆశలతో కలుషిత ప్రవృత్తి కలిగిన అక్కడి మనుషులతో ఇమడలేక... నిరాశతో తన నూతనప్రస్థానం కోసం వెదుక్కుంటూ భారంగా మరో ఊరివైపు పయనం సాగిస్తున్నారు.